ఆడుతూ.. పాడుతూ..



బద్రిలో ప్రాథమిక విద్యను బోధిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న ప్రీ స్కూల్ విద్యార్థుల వివరాలు	
మండలం	ప్రీ స్కూల్ పిల్లలు
సారవకోట	1065
జలుమూరు	1252
పోలాకి	1186
నరసన్నపేట	1258
పాతపట్నం	1099
మెళియాపుట్టి	1166
కొత్తూరు	1278
హిరమండలం	966

- అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ బోధన
- ఒకటో తరగతికి పూర్తిస్థాయి సంసిద్ధత
- యూట్యూబ్ చానల్ ద్వారా పాఠ్యాంశాల బోధన
- చిన్నారుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పాఠ్య పుస్తకాలు

సారవకోట: చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలకూ రోజూ వచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటోంది. ఆహ్లాదకరమైన వాతావరణం, బెంచీలు, బొమ్మలు, ఆటలు ఆడుకునే పరికరాలను సమకూర్చింది. ఆట, పాటలతో కూడిన ప్రాథమిక విద్య అందించేందుకు రోజుకొక విడియోను రూపొందించింది. తల్లిదండ్రులకు, అంగన్‌వాడీ కార్యకర్తల ఫోన్‌లకు పంపిస్తున్నారు.

చదువు, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు 3 నుంచి 4 ఏళ్లలోపు పిల్లలకు పీపీ-1, 4 నుంచి ఏళ్లలోపు పిల్లలకు పీపీ-2 అనే రెండు రకాల పుస్తకాలను తయారుచేశారు. దీంట్లో ఇంగ్లిషు, లెక్కలు, యాక్టివిటీ పుస్తకాలు పంపిణీ చేశారు. చిన్న, చిన్న ఆంగ్ల పదాలు నేర్పించడం, లెక్కల్లో అంకెలు, సంఖ్యలు నేర్పించడం చేస్తున్నారు. వీటిని నేర్పించడానికి బొమ్మలతో ఉన్న అంకెలు, సంఖ్యలు ఇవ్వడం వల్ల చిన్నారులు సులువుగా నేర్చుకునే వీలు ఉంటుంది. యాక్టివిటీ పుస్తకంతో చిన్న, చిన్న వస్తువులను పోల్చడం, వాటికి రంగులు అద్దడం ఉండేలా తయారు చేశారు. వీటి ద్వారా వస్తువుల పేర్లు, వాటి రంగులు తెలియజేయవచ్చును. ప్రతి నెలా వారి గ్రోత్ నమోదు చేసేందుకు పుస్తకాలున్నాయి. ఆరోగ్య స్థితి అంటే బరువు తక్కువ లేదా ఎత్తు తక్కువ, సాధారణంగా ఉన్నారా తదితర అంశాలను తెలియజేసేలా ఉన్నాయి. నూతన విద్యా విధానం ప్రకారం ప్రభుత్వం ఈ ప్రీస్కూల్ పిల్లల్ని సమీప ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించనుండటంతో ఇప్పటి నుంచే వారికి పీపీ-1, పీపీ- 2 పుస్తకాలను అందజేసి వారిని ఒకటో తరగతి సంసిద్ధతను చేస్తోంది.

పూర్వ ప్రాథమిక విద్య పటిష్టతకు చర్యలు



పూర్వ ప్రాథమిక విద్యన భ్యసించే విద్యార్థులకు కొత్తగా అందించిన పీపీ-1, పీపీ-2 పుస్తకాలు ఎంతో ఉపయోగంగా ఉన్నాయి. వాటితోపాటు ప్రతీ రోజు అంగన్‌వాడీ కార్యకర్తల ఫోన్లుకు ప్రీస్కూల్ యాక్టివిటీపై యూట్యూబ్ విడియోలు పెడుతున్నాం. చిన్నారులకు అర్థమయ్యేలా బోధిస్తున్నాం.

– హెచ్.కె.కామాక్షి, సీడీపీఓ, సారవకోట

డీపట్టా రద్దు చేయాలని వినతి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రభాకరనాయుడు

ఎల్.ఎన్.పేట: మండలంలోని డొంకలబడవంజ గ్రామానికి ఎగువున సర్వే నంబర్ 2లో ఉన్న సాగరం చెరువు గర్భంలో ఇచ్చిన డీపట్టాను రద్దు చేయాలని కోరుతూ అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఆయకట్టు రైతు గేదెల ప్రభాకరనాయుడు కోరారు. టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగి స్పందనలో టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. దశాబ్దాల క్రితం స్థానికేతరుడైన ఓ వ్యక్తికి 6.52 ఎకరాలను (చెరువు గర్భాన్ని) ఇచ్చారని గుర్తు చేశారు. రైతుల సాగునీటి అవసరాలకు ఉపయోగపడే చెరువులో డీ పట్టా ఇవ్వటం వల్ల రైతులకు సాగునీరు అందటం లేదన్నారు. ఈ విషయమై రైతులు పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి దృష్టికి తమ గ్రామ రైతులు తీసుకుని వెళ్లగా.. పట్టా రద్దు చేయాలని సిఫార్స్ లేఖ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ లేఖ ప్రాప్తికి డీపట్టా రద్దు చేయాలని ఎల్.ఎన్.పేట తహసీల్దార్‌కు గతంలో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని ఆయన సబ్ కలెక్టర్‌కు వివరించారు. మరోసారి పరిశీలించి చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ తెలిపారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

కొత్తూరు: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇప్పిలి నారాయణరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మార్చి ఒకటో తేదీన ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం శ్రీకాకుళం జిల్లా సర్వసభ్య సమావేశానికి సంబంధించిన కరపత్రాలను సోమవారం కొత్తూరులో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. రాష్ట్ర అధ్యక్షుడు కాశీభట్ల రామసేర్యనారాయణ హాజరవుతారన్నారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు హాజరుకావాలని కోరారు. ఉద్యోగుల సమస్యలు, డిమాండ్‌లు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.



కొత్తూరు: కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

నరసన్నపేట: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా సర్వసభ్య సమావేశం మార్చి ఒకటో తేదీన శ్రీకాకుళంలో జరుగుతుందని, దీనిని విజయవంతం చేయాలని సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి తాతబాబు, కోశాధికారి కె.సూర్యనారాయణ కోరారు. సోమవారం నరసన్నపేటలో వీరు ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ మేరకు ప్రచారం చేపట్టారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కాశీబట్ల రామసూర్యనారాయణ, గొంతి భాస్కరరావు పాల్గొంటారని తెలిపారు.

సారవకోట: మార్చి 1న జిల్లా కేంద్రంలో జరగనున్న ఉద్యోగుల సర్వసభ్య సమావేశానికి సంబంధించిన పోస్టర్‌ను ఎంపీడీఓ విశ్వేశ్వరరావు, ఇతర ఉద్యోగులు సోమవారం ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు. మండల పరిషత్ ఏఓ ప్రసాదరావు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నాగుపాము కలకలం

నరసన్నపేట: స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం సాయంత్రం గోధుమ నాగు సంచరించడాన్ని డ్యూటీలో ఉన్న పోలీసులు గుర్తించారు. సీఐ కార్యాలయం వైపునుంచి స్టేషన్ వైపు వస్తుండటాన్ని గమనించారు. వెంటనే అప్రమత్తమైన సీఐ రాము, ఎస్ఐ సింహాచలం పాములు పట్టడంలో నేర్పరి అయిన విశ్రాంత ఆర్మీ రామజోగికి సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి పామును పట్టుకుని పొలాల్లో విడిచి పెట్టారు.



పట్టుకున్న పామును చూపిస్తున్న విశ్రాంత ఆర్మీ ఉద్యోగి

ఎల్లమ్మ జాతర ప్రారంభం

పాతపట్నం: మండలంలోని కొరసవాడ గ్రామంలో గల ఎల్లమ్మ తల్లి జామి జాతర సోమవారం ప్రారంభించారు. ఉదయం నుంచి ఆలయం వద్దకు భక్తులు ముడుపులు తీసుకుని వచ్చి అమ్మవారికి సమర్పించారు. పోతయ్య వేషధారణ అందర్నీ ఆకట్టుకుంది. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

నేడు మిరియాపల్లి గ్రామంలో..

ఎల్.ఎన్.పేట: మిరియాపల్లి గ్రామంలో కొలువైన ఎల్లమ్మ, పోతయ్య జాతరను మంగళవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జాతరకు మిరియాపల్లి గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు వేలాదిగా తరలి వస్తారని సర్పంచ్ కోడి సుధారాణి తెలిపారు. సిర్ల ఎల్లమ్మ గుడివద్ద ఉన్న పుట్టకు పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు తీర్చుకుంటారు.



పాతపట్నం: కొరసవాడలో ఎల్లమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

నివగాం గ్రామంలో..

కొత్తూరు: మండలంలోని వంశధార నది ఒడ్డున ఉన్న నివగాం గ్రామంలో గల సిర్లి పోతన్న, యల్లమాంబ జామి యాత్ర మార్చి ఒకటో తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పర్లాకిమిడి రాజులు వందల ఏళ్ల కిందట ఈ ఆలయం నిర్మించారు. నివగాంకు చెందిన దిడ్డి సీతారాం, సింహాచలం, నాగరాజు, జగ్గయ్య వంశస్తులు ఈ యాత్ర చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఐదు రోజులపాటు యాత్ర నిర్వహిస్తారు.

పెరికి వీధిలో..

హిరమండలం: స్థానిక పెరికి వీధిలో గల సిర్లి పోతన్న, ఎల్లమ్మ తల్లి (జామి) యాత్రను మంగళవారం నుంచి మార్చి 2వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఏటా శివరాత్రి పోయిన పది రోజుల తరువాత ఈ యాత్ర జరగడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

నరసన్నపేట: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్‌ను ధరించాలని స్థానిక ఎస్ఐ వై.సింహాచలం అన్నారు. మండల పరిధిలోని జాతీయ రహదారిలోని ప్రధాన కూడళ్లలో హెల్మెట్ ధారణపై వాహనదారులకు అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ జి.రాధిక ఆదేశాల మేరకు పలుచోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్థిక లావాదేవీలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న బీఎం అరుణ్‌కుమార్

పొందూరు: ఆర్థిక లావాదేవీల విషయంలో మహిళలు అవగాహన పెంచుకోవాలని తాడివలస ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్ అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గోకర్నపల్లి గ్రామంలో సర్పంచ్ చింతాడ మాధురి అధ్యక్షతన డ్వాక్రా గ్రూపు మహిళలకు నిర్వహించిన ఆర్థిక అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అమలు చేస్తున్న పలు పథకాలపై అవగాహన కల్పించారు. మాజీ ఎంపీటీసీ చింతాడ ప్రసాద్, సీఎఫ్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాతపట్నం: ప్రహరాజపాలెంలో ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం (ఆంగ్ల మాధ్యమం)లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ వి.అర్చన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 నుంచి మార్చి 24వ తేదీ వరకు 5వ తరగతిలో చేరేందుకు, ఇంటర్ మొదటి సంవత్సరానికి మార్చి 23 తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాల సమయంలో సంప్రదించాలన్నారు.

సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

పొందూరు: స్పందన కార్యక్రమానికి వస్తున్న ఫిర్యాదులు, వినతులు, సమస్యలను ఆయా శాఖల అధికారులు తక్షణం, లేదంటే మూడు రోజుల్లో పరిష్కరించాలని మండల అధికారులను తహసీల్దార్ ఎస్.రాంబాబు ఆదేశించారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ పీవీ రామరాజు, ఏఓ బెండి బాబ్జి, ఇన్‌చార్జి ఎంపీడీఓ మురళి, ఏపీఓ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

మండల పాస్టర్ ఫెలోషిప్ ప్రెసిడెంట్‌గా కృపావరం

ఆమదాలవలస: మండల పాస్టర్ ఫెలోషిప్ ప్రెసిడెంట్‌గా జి.కృపావరంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని వెంగళరావు కాలనీలో ఆమదాలవలస నియోజవర్గ పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు జార్జ్ ముల్లర్, సీజేఎసీ జిల్లా అధ్యక్షుడు రాడ విజయ్‌కుమార్ సమక్షంలో సోమవారం ఈ ఎన్నిక జరిగింది. ఫెలోషిప్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.షద్రక్, సెక్రెటరీలుగా ఆర్.శ్యామ్, ఎస్.ప్రసాద్, ట్రెజరర్‌గా పి.స్టీవెన్, గౌరవ అధ్యక్షుడిగా ఆర్.ఆనందరావుతోపాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. వివిధ చర్చిల నుంచి పాస్టర్లు పాల్గొన్నారు.

అమ్మవారి తోటలో బోరు నిర్మాణం

పాతపట్నం: స్థానిక నీలమణిదుర్గ ఆలయం ఏదురుగా ఉన్న మామిడి తోటలో భక్తుల కోసం బోరు తీయడం జరిగిందని ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు తెలిపారు. సోమవారం అమ్మవారి ఆలయం ముందు తోట బోరు నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తుల వంటల కోసం బోరును పాతపట్నంకు చెందిన దేవాది రామారావు తమ సొంత నిధులు అందజేశారన్నారు. వైస్ ఎంపీపీ ప్రదీప్, ఆలయ కమిటీ మెంబర్లు కృష్ణారావు, నేతాజీ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నర్తును భారీ మెజార్టీతో గెలిపించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి, పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: శ్రీకాకుళం జిల్లా వైఎస్సార్‌సీపీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావును భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి పిలుపునిచ్చారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తుతో కలిసి నియోజకవర్గంలోని ఎంపీటీసీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన ఈ మూడున్నర ఏళ్లలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నర్తు విజయానికి పార్టీ నాయకులు అంకితభావంతో కృషి చేయాలన్నారు. మెళియాపుట్టి జెడ్పీటీసీ గూడ ఎండయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామ్‌సుందరరావు, బాలరాజు, సురేష్, సూర్యనారాయణ, పార్టీ నాయకులు త్రినాథరావు, రెడ్డి రామారావు, బైపోతు ఉదయ్‌కుమార్, ప్రదీప్, వెంకటరమణ, పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై కసరత్తు

పోలాకి: మండలంలోని పలు పంచాయతీల్లో ఖాళీగా ఉన్న వార్డు మెంబర్లు, ఈదులవలస ఎంపీటీసీ స్థానానికి ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తు జరుగుతున్నట్లు ఎంపీడీఓ ఈశ్వరరావు తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పోలాకి, కొత్తరేవు, రాళ్లపాడు, గుప్పెడుపేట, రహిమానుపురం, గాతలవలస, ఈదులవలసలలో ఓటర్ల జాబితాలు ప్రదర్శన చేయాలని సూచించారు. అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం క్షేత్రస్థాయిలో రిపోర్టు అందించిన తరువాత దాన్ని ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఎన్నికల నిర్వహణ జరుగుతుందని వివరించారు.



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ ఈశ్వరరావు

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ఆమదాలవలస రూరల్: ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ ఏడీఏ కె.జగన్మోహనరావు అన్నారు. పట్టణంలో గల ఎరువుల దుకాణాల్లో సోమవారం తనిఖీలు నిర్వహించి, పలు రికార్డులను పరిశీలించారు. నిర్ణీత ధర కంటే రైతులకు ఎక్కువ ధరలకు పురుగు మందులను విక్రయిస్తే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులు వరితో పాటు వాణిజ్య పంటలను సాగు చేస్తున్నందున వారికి అవసరమైన పురుగు మందులను శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు సూచించిన మేరకే విక్రయించాలని, బిల్లులు ఇవ్వాలని సూచించారు. నోటీస్ బోర్డులో ఎరువులు, పురుగు మందుల వివరాలు, ధరలు ప్రదర్శించాలని డీలర్లకు సూచించారు. ఏఓ మెట్ట మోహనరావు ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ జగన్మోహనరావు

సుధాకర్‌ను గెలిపించండి

ఆమదాలవలస రూరల్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు సువ్వారి గాంధీ అన్నారు. మండలంలో కొత్తవలస, నిమ్మతొర్లాడ, జీకేవలస పంచాయతీల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్లను కలిసి జగనన్న అందిస్తున్న సుపరిపాలన గురించి తెలియజేశారు. యువతకు ఉపాధి కల్పన జరగాలంటే వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థి సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో భాగంగా ఓటర్లకు పోలింగ్ బూత్ నంబర్‌తోపాటు పూర్తివివరాలు కలిగిన కరపత్రాలను అందజేశారు. పార్టీ నాయకులు సువ్వారి సత్యనారాయణ, పేడాడ వైకుంఠరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న సువ్వారి గాంధీ

సంక్షిప్తంగా..

ఇరువర్గాల కొట్లాట

మెళియాపుట్టి: మండలంలోని శేఖరాపురం గ్రామానికి చెందిన ఇరు కుటుంబాల మధ్య చోటుచేసుకున్న వాగ్వాదం కొట్లాటకు దారితీసింది. మెళియాపుట్టి ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం వేకువజామున శేఖరాపురం గ్రామానికి చెందిన పక్కపక్కన ఇళ్లల్లో ఉన్న బొంగర్ల ఖగేష్, తెంబూరు ఢిల్లీ కుటుంబాలకు చెందిన మహిళల మధ్య ముగ్గు విషయంలో వాగ్వాదం చోటుచేసుకుంది. గొడవ విన్న ఖగేష్, ఢిల్లీ బయటికి వచ్చి కేకలు వేసుకున్నారు. అనంతరం ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. తెంబూరు ఢిల్లీ తలకు బలమైన గాయం కావడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. బొంగర్ల ఖగేష్ పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ధర్మరక్ష నిధి సేకరణకు సహకరించండి

నరసన్నపేట: ధర్మరక్షణ, దేశసేవే లక్ష్యంగా వీహెచ్‌పీ పనిచేస్తుందని, ఈ దశలో ధర్మరక్ష నిధి సేకరణకు అందరూ సహకరించాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గుంటక సాయిరాం అన్నారు. నరసన్నపేట, సత్యవరంలో సోమవారం వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి నిధి సేకరణ చేపట్టారు. సాయిరాం మాట్లాడుతూ ధర్మరక్ష నిధి సేకరణలో దేశం మొత్తం భాగస్వామ్యం అవుతుందన్నారు. నరసన్నపేట వాసులు కూడా స్పందించాలని కోరారు. జిల్లా బాల సంస్కార ప్రముఖులు గుంటక శ్రీధర్, కరుణశ్రీ, సుధాకర్, నరసన్నపేట ప్రఖండ ప్రతినిధి వారణాశి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో సమయపాలన తప్పనిసరి

మెళియాపుట్టి: రెండుపూటలా పనులు చేయడం ద్వారా పూర్తిస్థాయి వేతనం లభిస్తుందని, మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు తప్పనిసరిగా నిర్వహించాలని ఏపీఓ తెంబూరు రవి అన్నారు. చాపర ఎర్రబంద చెరువు, మెళియాపుట్టి మండల కేంద్రంలో జరుగుతున్న వరద నియంత్రణకట్ట పనులను సోమవారం పరిశీలించారు. మార్చి నెలాఖరుకల్లా జాబ్‌కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి 100 రోజులు పని దినాలను పూర్తిచేయడమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. సమయపాలన పాటించడం తప్పనిసరి అని, కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా జాగ్రత్తలు పాటించాలన్నారు. క్షేత్ర సహాయకులు కె.సింహాచలం, భాస్కరరావు, ఉపాధి మేట్లు తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

హిరమండలం: ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హైపవర్ కమిటీ సభ్యులు కె.అప్పలరామ్, డి.ఉమామహేశ్వరరావు అన్నారు. హిరమండలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతన్న ప్రాక్టికల్ పరీక్షలను సోమవారం పరిశీలించారు. కళాశాల ప్రిన్స్‌పాల్ పి.ఈ.ఎస్. పట్నాయక్ మాట్లాడుతూ ఉదయం జనరల్‌కు సంబంధించి 60 మంది హాజరుకావల్సి ఉండగా 53 మంది హాజరయ్యారన్నారు. ఒకేషనల్‌కు సంబంధించి 32 మందికి 26 మంది హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం నుంచి జరిగిన ప్రాక్టికల్స్‌కు జనరల్‌లో 50 మంది విద్యార్థులకు ఒక్కరు గైర్హజరయ్యారు. ఒకేషన్‌లకు సంబంధించి 22 మందికి నలుగురు గైర్హజరైనట్లు ప్రిన్స్‌పాల్ తెలిపారు.

వైఎస్సార్ బీమా తక్షణసాయం అందజేత



తక్షణ సహాయాన్ని అందజేస్తున్న ఎంపీటీసీ శ్రీరాములు

నరసన్నపేట: ముద్దాడపేటకు చెందిన చిట్టూరు రాఘవరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతుని భార్య నారాయణమ్మకు వైఎస్సార్ బీమా తక్షణ సహాయం రూ.10 వేలను ఎంపీటీసీ పంగ శ్రీరాములు సోమవారం పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది ఉన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్ ఆదర్శప్రాయుడు

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వతంత్ర్య సమర యోధుడు చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం జి.ఎం.పాత్రో, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, లయన్స్ క్లబ్ సర్వీస్ చైర్‌పర్సన్ ఎం.కె.మిశ్రోలు ఆజాద్ చిత్రపటానికి పూలమాలను వేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న విప్లవ వీరుల్లో ఆజాద్‌ది ఎంతో కీలక పోరాటమని కొనియాడారు. ఆజాద్ జీవిత చరిత్రలోని కొన్ని ముఖ్యమైన అంశాలను విద్యార్థులకు తెలియజేశారు. ఉపాధ్యాయుడు ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఘటాల ఊరేగింపు



సత్యవరంలో ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు

నరసన్నపేట: సత్యవరంలో పాదాలమ్మతల్లి సిరిమాను మహోత్సవం సందర్భంగా సోమవారం ప్రధాన ఘటాలు ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దూకులపాడు, తండ్యాలవానిపేటల్లో కూడా ఘటాలను ఊరేగించారు. ప్రతీ ఇంటి వద్ద మహిళలు ఘటాలకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. చంటి పిల్లలను ఘటాల కాళ్లపై వేసి దీవెనలు పొందారు. మంగళవారం సిరిమాను ఊరేగింపు ఉంటుందని, ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిటీ అధ్యక్షుడు, ఎంపీపీ ఆరంగి మురళి కోరారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

హిరమండలం: విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన అవసరమని చొర్లంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు యశ్వంత్, మౌనిక అన్నారు. జగన్నాథపురం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం వైద్య తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థులకు ఐరన్, ఫోలిక్‌యాసిడ్ మాత్రలను అందించారు. హెచ్‌ఎం అల్లాడ సురేష్, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి విరాళాల సేకరణ



విరాళాలను సేకరిస్తున్న సర్పంచ్, కమిటీ సభ్యులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని శ్యాలమలాపురం గ్రామం వద్ద గల వంశధార పునరావాస కాలనీలో ఉమామల్లేశ్వర స్వామి ఆలయ నిర్మాణం కోసం దాతలు విరాళాలు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారని సర్పంచ్ బలగ లక్ష్మి అన్నారు. ఈ కాలనీలో పాడలి, దుగ్గుపురం, తులగాం గ్రామాలకు చెందిన సుమారు 460 కుటుంబాలకు చెందిన వంశధార నిర్వాసితులు నివాసం ఏర్పాటు చేసుకున్నారని అన్నారు. పాత గ్రామంలో ఉన్న శివాలయం నిర్మాణం పనులు చేపట్టగా పునరావా కాలనీకి చెందిన దాతలు ముందకు వచ్చి విరాళాలు ఇస్తున్నట్లు తెలిపారు. విరాళాల సేకరణలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బలగ గోవిందరావు, అర్చకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ప్రజలకు జవాబుదారీగా ఉండాలి



తలతరియాలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీపీ గోపి

జలుమూరు: సచివాలయ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించి, వారికి జవాబుదారీగా ఉండాలని ఎంపీపీ వాన గోపి అన్నారు. టి.లింగాలుపాడు, జోనంకి సచివాలయాలను సోమవారం తనిఖీ నిర్వహించి సిబ్బందితో మాట్లాడారు. సచివాలయానికి వచ్చే వారితో స్నేహభావంతో మెలగాలన్నారు. అర్హులు అయితే వారికి కచ్చితంగా సంక్షేమ పథకాలు అందించాలన్నారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించారు. హాజరు రికార్డులు చూసి సమయపాలన ప్రధానమన్నారు. పైడి విశలరావు, సిబ్బంది ఉన్నారు.

ఆర్.ఎల్.పురంలో ఫ్యామిలీ డాక్టర్



వైద్య సేవలు అందజేస్తున్న వైద్యుడు శ్రీధర్

పాతపట్నం: మండలంలోని ఆర్.ఎల్.పురం గ్రామంలో బైదలాపురం పీహెచ్‌సీ వైద్యుడు ఐ.శ్రీధర్ ఆధ్వర్యంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలతోపాటు మంచం పట్టిన రోగులు, బీపీ, సుగర్ వంటి సమస్యలతో బాధపడుతున్నవారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం, ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. ఏఎన్ఎం కల్యాణి, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.